క్లుప్తంగా

అప్పన్న అన్నదానానికి రూ.లక్ష విరాళం



అన్నప్రసాద బాండ్ అందుకుంటున్న దాత జేఎస్ఎన్ రాజు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని పీఎం పాలేనికి చెందిన జేఎస్ఎన్ రాజు రూ.లక్ష 116ల విరాళాన్ని అందించారు. సంబంధిత విరాళాన్ని నగదు రూపంలో సింహగిరి పైనున్న పీఆర్వో కార్యాలయంలో అధికారులకు ఇచ్చారు. దేవస్థానం తరఫున దాతకు ప్రొటోకాల్ సూపరింటెండెంట్ విక్రమ్ దాతకు బాండ్‌ని అందించారు. స్వామివారి దర్శనం కల్పించి, ప్రసాదం, శేషవస్త్రాన్ని అధికారులు అందజేశారు.

ధ్యానంలో ప్రపంచస్థాయి రికార్డు



చరణ్

మధురవాడ: ధ్యానంలో అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని రికార్డు నెలకొల్పారు మధురవాడకు చెందిన ఐ. చరణ్. ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా డిసెంబర్ 21న నాగ్‌పూర్‌కు చెందిన వెల్‌నెస్ హ్యాబిల్డ్ సంస్థ ఆన్‌లైన్‌లో నిర్వహించిన మెడిటేషన్ ఈవెంట్‌లో 5 గంటల 45 నిమిషాల పాటు ధ్యానంలో ఉండి వరల్డ్ రికార్డులో భాగస్వాములయ్యారు. ఈ మేరకు వరల్డ్ రికార్డ్స్ యూనియన్ అధికారులు ధ్రువీకరించి మంగళవారం ప్రశంసాపత్రాన్ని పోస్టులో పంపించారు. దీంతో పాటు రూ. 20వేలు నగదు అందజేయనున్నట్టు హ్యాబిల్డ్ సంస్థ సీఈవో సౌరభ్ బొత్రా ప్రకటించారు. స్థానికంగా ఓ ప్రైవేట్ స్కూల్లో యోగా టీచర్‌గా చేస్తున్న చరణ్ పంజాబ్ పాటియాలా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో యోగాలో ఎన్ఐఎస్ కోర్స్ పూర్తి చేసి, వందల సంఖ్యలో విద్యార్థులకు యోగా, క్రీడల్లో శిక్షణ ఇచ్చారు.

నేటి నుంచి శిల్పారామంలో అఖిల భారత క్రాఫ్ట్స్‌మేళా

పీఎం పాలెం: శిల్పారామం (జాతర)లో గురువారం ఉదయం 11 గంటలకు అఖిల భారత క్రాఫ్ట్స్ మేళా ప్రారంభం అవుతుందని స్థానిక పరిపాలన అధికారి టి. విశ్వనాధ రెడ్డి తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాల చేనేత వస్త్రాలు, హస్తకళల కళాకారులు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శన-విక్రయ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ నెల 16వ తేదీ వరకు మేళా కొనసాగుతుందన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస: భీమిలి మండలం శింగనబంద పంచాయతీ మద్దిలపేటలో వైఎస్సార్‌సీపీ నాయకులు నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. జిల్లా క్వారీ లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు మద్దిల వెంకటరమణ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. నాయకులు మద్దిల సూరిబాబు, కనకల గోవింద, ఎంఎస్ఎన్ రాజు, మద్దిల గురునాథ్, టి.రెడ్డి, యు.ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

జొన్నాడ టోల్‌ప్లాజా వద్ద వసతులు కల్పించాలి

తగరపువలస: భీమిలి మండలం బోడమెట్టపాలెం బోర్డర్‌ను ఆనుకుని జొన్నాడ టోల్‌ప్లాజ్ వద్ద వసతులు కల్పించాలని వాహనదారులు కోరుతున్నారు. ఈ టోల్‌ప్లాజా వద్ద వాష్‌రూమ్‌లు, విశ్రాంతి గదులు లేకపోవడంతో పాటు ఇరువైపులా 5 కిలోమీటర్ల వరకు గతుకులతో కూడిన రహదారులు ఉన్నాయంటున్నారు. ఎలాంటి వసతులు లేకుండా టోల్‌ఫీజు వసూలు చేస్తున్న యాజమాన్యంపై ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

మురుగు పోయే మార్గమేదీ?

వాడుక నీరు బయటకు పోయే మార్గం లేదు. ఇంటి ముందే మురుగు నిలిచిపోవడంతో భరించలేని దుర్గంధం.. మరోవైపు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న దోమలు.. ఇక వర్షం వస్తే ఆ నీరు, మురుగు ఏకమై రోడ్లపై ప్రవహిస్తుంది. నీరు రోడ్డుపై నిలిచిపోయి గుంతలు పడి తరచూ ప్రమాదాలు.. డ్రైనేజీలు లేక పొడుగుపాలెం ఎస్సీ కాలనీవాసులు పడుతున్న అవస్థలివీ..

- సాకారం కాని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ
- భరించలేని దుర్గంధం
- దోమలతో సహవాసం
- పొడుగుపాలెం ఎస్సీ కాలనీ వాసుల అవస్థలు



కుళాయి నుంచి బీటీ రోడ్డు మీదకు పోతున్న వృథా నీరు



బోని వెళ్లే మలుపు వద్ద మురుగు కారణంగా ఏర్పడిన గుంత



ఆనందపురం-బోని రహదారికి మరోవైపు కూడా డ్రైనేజీలు లేని దృశ్యం

తగరపువలస: ఆనందపురం పంచాయతీకి చెందిన పొడుగుపాలెం ఎస్సీ కాలనీ వద్ద బోని వెళ్లే మార్గంలో డ్రైనేజీలు లేక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దుర్గంధం, దోమలతో సహవాసం చేస్తున్నారు. మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో బీటీ రోడ్డు ద్వారా రాకపోకలు సాగించే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇక్కడ కాలనీకి ఇరువైపులా ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి. కాలనీతో పాటు చుట్టుపక్కల నివాసం ఉంటున్నవారికి కూడా డ్రైనేజీ సదుపాయం లేదు. వీరిలో చాలా మందికి వ్యక్తిగత మరుగుదొడ్లు కూడా లేవు.

గతంలో ఈ ప్రాంతంలో నిర్మిస్తామన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణానికి నోచుకోలేదు. దీంతో ఇళ్ల నుంచి వాడుక నీటితో పాటు వర్షం నీరు వీరి ఇళ్ల మధ్య నిలిచిపోవడంతో పాటు బీటీ రోడ్డు మీదుగా ప్రవహిస్తూ ఉంటుంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు నిత్యం మురుగులో నుంచే వెళ్లవలసి వస్తోంది. కాలనీలో పెంకుటిళ్లు శిథిలావస్థకు చేరుకున్నా డ్రైనేజీలు మాత్రం నిర్మించలేదని పొడుగుపాలెం వాసులు అంటున్నారు.

సీసీ రోడ్డు, ఇంటింటా కుళాయిలు ఉన్నా ..

ఎస్సీ కాలనీకి సీసీ రోడ్డు, ఇంటింటా కుళాయిలు ఉన్నా డ్రైనేజీలు లేక సమస్య కాలనీకే పరిమితం కావడం లేదు, నిత్యం రద్దీగా ఉండే బీటీ రోడ్డుపై ప్రయాణించే వారికి సమస్యగా మారింది. ఇక్కడి వాడుకనీరు బీటీ రోడ్డుకు ఇరువైపులా మలుపుల వద్ద నిల్వ ఉండటంతో గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వేగంగా వచ్చే వాహనదారులు కూడా ప్రమాదాలకు గురవుతున్నారు. దీనికి తోడు టాయిలెట్లు లేని కారణంగా బీటీరోడ్డు దాటుతూ ఇక్కడివారు ప్రమాదాల బారిన పడుతున్నారు. శిథిలమైన ఇళ్లలో మూడు నుంచి నాలుగేసి కుటుంబాలు ఇరుకుగా జీవిస్తున్నామని వాపోయారు. కాలనీని వేధిస్తున్న డ్రైనేజీ సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని కోరుతున్నారు.



ఎస్సీ కాలనీలో డ్రైనేజీలు లేని రోడ్డు

దుర్గంధం భరించలేం



డ్రైనేజీలు లేకపోవడంతో వాడుకనీరు ఇళ్ల ముందు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతూ ఉంటుంది. దీంతో తాగే నీరు, తినే తిండి సహించడం లేదు. అధికారులు స్పందించి డ్రైనేజీలు నిర్మించి కాలనీవాసులకు సహకరించాలి.

– బొద్దు శంకర్, ఎస్సీ కాలనీ

దోమలు, పురుగుల బెడద



డ్రైనేజీలు లేకపోవడంతో ఇళ్ల ముందు దోమలు, పురుగుల బెడద ఎక్కువగా ఉంది. మేమంతా కూలిపనులు చేసుకుని కాలం వెళ్లదీస్తున్నాం. వీటి బెడద పోగొట్టి మా ఆరోగ్యానికి రక్షణ కల్పించాలి.

– నిడిగట్టు ఇందు, ఎస్సీ కాలనీ

తరచూ ప్రమాదాలు



మా ఇళ్ల నుంచే కాకుండా చుట్టుపక్కల నుంచి వచ్చే వాడుకనీటితో పాటు వర్షంనీరు బోని వెళ్లే బీటీ రోడ్డు పైకి చేరి గోతులు ఏర్పడ్డాయి. కాలనీకి రెండు వైపులా మలుపుల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

– నిడిగట్టు రమణమ్మ, ఎస్సీ కాలనీ

నాలుగు దశాబ్దాల కల.. నెరవేరుతున్న వేళ..



అమనాం బీసీ ఎస్సీ కాలనీలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు

తగరపువలస: భీమిలి మండలం అమనాం పంచాయతీ ఎస్సీ, బీసీ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణంతో నాలుగు దశాబ్దాల నాటి నిరీక్షణకు మోక్షం లభించిందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 1983-84లో కాలనీ ఏర్పాటైనా, స్థానిక రాజకీయాల కారణంగా రోడ్ల నిర్మాణానికి నోచుకోలేదన్నారు. రూ.25.50 లక్షలతో పోలమాంబ ఆలయంతో పాటు మిగిలిన వీధులకు ఈ నిర్మాణాలు పూర్తి చేశారు. ఇప్పటికైనా రాజకీయాలకు అతీతంగా కాలనీకి రోడ్డు నిర్మాణం జరగడం హర్షణీయమని పంచాయతీ పెద్దలు తెలిపారు. ఇంకా కాలనీలో మిగులు భూమిలో కూడా వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో చుక్క ఆదిరెడ్డి, కంబపు శివకుమార్, మరగడ రఘురామిరెడ్డి, కొల్లి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

'మా నాన్నమ్మను తప్పుదోవ పట్టించారు'

తగరపువలస: తన నాన్నమ్మ ఊళ్ల నరసయ్యమ్మ వృద్ధాప్యంతో పాటు చూపు, వినికిడి సమస్యలతో బాధ పడుతోందని, ఆమెను అడ్డు పెట్టుకుని తన బాబాయిలు తనపై తప్పుడు ఆరోపణలు చేశారని జీవీఎంసీ రెండోవార్డు సంగివలసకు చెందిన మాజీ సైనికుడు ఊళ్ల వెంకట విజయ నరసింహులు తెలిపారు. ఆయన సంగివలసలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మొదటి మనుమడినైన తనకు 2015లోనే నాన్నమ్మ 12 సెంట్లు స్థలం రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చిందన్నారు. అలాగే తన చిన్నాన్న కుమారులకు కూడా 10 సెంట్లు చొప్పున ఇచ్చిందన్నారు. నాన్నమ్మ, తాతయ్యల బాగోగులు తానే చూశానని, భవిష్యత్తులో కూడా చూస్తానన్నారు. తనపై ఆరోపణలు చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు.

● శుభాకాంక్షలు



నగరంలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అమరనాథ్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియచేస్తున్న ఆనందపురం మండల పార్టీ అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, సీనియర్ నాయకులు – తగరపువలస



ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణను కలిసిన భీమిలి ఎంపీపీ వాసురాజు తదితరులు – తగరపువలస

భక్తిశ్రద్ధలతో 'ఆరాధన'



ఆరాధనకు హాజరైన ఉత్తరాంధ్ర, ఉభయగోదావరి జిల్లాల ప్రతినిధులు



ప్రసంగిస్తున్న సిస్టర్ శైలాపాల్

తగరపువలస: ఆనందపురం మండలం గండిగుండం గ్లోబల్ ప్రేయర్ స్టేడియంలో బుధవారం నూతన సంవత్సర ఆరాధనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పి.జయ స్టీఫెన్ పాల్ మినిస్ట్రీస్ ఫౌండర్ అండ్ డైరెక్టర్ పీజే స్టీఫెన్‌పాల్, శైలాపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తరాంధ్రతో పాటు ఉభయగోదావరి జిల్లాలకు చెందిన వేలాది మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టీఫెన్‌పాల్, శైలాపాల్ ప్రసంగించారు. మానవాళి పాప పరిహారం కోసం ప్రభువైన యేసుక్రీస్తు రక్తం చిందించారన్నారు. మన పాపాల నుంచి ఆయన విముక్తి కలిగించారన్నారు. క్రైస్తవ్యం ఒక మతం కాదని అది పరలోక రాజ్యానికి మార్గమని పేర్కొన్నారు. అందరి జీవితాలు ఫలభరితం కావాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చిన్నారులు నృత్యాలతో అలరించారు. ఈ నెల 16,17,18 తేదీలలో నగరంలోని పోర్టు కళా స్టేడియంలో జరుగు ప్రత్యేక ఉపవాస ప్రార్థనలలో అందరూ పాల్గొనాలని ఆహ్వానం పలికారు.

ఆలయాలకు 'నూతన' శోభ

- ప్రత్యేక అలంకరణలో దేవతామూర్తుల దర్శనం
- పోటెత్తిన భక్తజనం
- ఉదయం నుంచి ప్రత్యేక పూజలు



ఆకట్టుకున్న శ్రీవారి భక్తుల కోలాటం



శ్రీవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు





ప్రత్యేక అలంకరణలో లలితా త్రిపుర సుందరీ దేవి, కల్యాణ వేంకటేశ్వర స్వామి



ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి ఆలయంలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ట్రస్ట్ సభ్యులు



కొత్తమ్మతల్లి ఆలయంలో శీరపు అప్పలరెడ్డి తదితరులు

కొమ్మాది: నూతన సంవత్సర ఆగమన వేళ ఆలయాలన్నీ నవ్య శోభను సంతరించుకున్నాయి. నూతన సంవత్సరం శుభప్రదంగా ఉండాలని ఆకాంక్షిస్తూ భక్తులు దేవాలయాలకు పోటెత్తారు. ఈ సందర్భంగా ఆలయాలను, దేవతామూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, దర్శనాలు కల్పించారు.

● భీమిలి బీచ్‌రోడ్ రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు క్యూ కట్టారు. ఆలయంలో వేకువజామున 4 గంటల నుంచి 5.30 గంటల వరకు తిరుప్పావై, శుద్ధి, ధనుర్మాస, ఆరాధన, తోమాల సేవ అనంతరం సర్వ దర్శనాలు కల్పించారు. ఉదయం నుంచి రాత్రి వరకు వేలాది మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. దాస సాహిత్య ప్రాజెక్ట్ శ్రీమన్నారాయణ భజన కోలాట మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. మండలి అధ్యక్షురాలు బి.సాయి రోజాకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన కోలాటంలో వేంకటేశ్వరస్వామి గీతాలకు కోలాటం నిర్వహించారు.

● స్థానిక అన్నంరాజు నగర్‌లోని అష్టలక్ష్మీ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద ఎత్తున మహిళలు పూజల్లో పాల్గొన్నారు.

మధురవాడ: మధురవాడ సిద్ధేశ్వర స్వామి పీఠం, చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఐటీ సెజ్ జంక్షన్ వద్ద గల మానం ఆంజనేయులు కాలనీలోని శ్రీ లలితా త్రిపుర సుందరీ సమేత మహా కామేశ్వర స్వామి ఆలయంలో ధర్మకర్త బొడ్డేపల్లి సురేష్ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో నరసింహామూర్తి, పిళ్లా సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నవనీత అలంకరణలో కల్యాణ వేంకటేశ్వరుడు

భీమునిపట్నం: కల్యాణ వేంకటేశ్వరుడు నవనీత అలంకరణలో దర్శనమిచ్చారు. స్థానిక కృష్ణా కాలనీ కొండపై ఉన్న ఆలయంలో అర్చకులు జి. అప్పలాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, సభ్యులు పాల్గొన్నారు.

● ఐశ్వర్య వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో అర్చకులు పురాణం శేషాచార్యులు ఆధ్వర్యంలో నవనీత సేవ, ప్రత్యేక పూజలు చేశారు. కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆలయ ట్రస్టీలు కలిగొట్ల శ్రీరామ్, కె.ఎస్.ఎన్.మూర్తి, కె.భానోజీరావు, కె.శ్రీనివాసరావు, వి.తాతాజీ పాల్గొన్నారు.

కొత్తమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

తగరపువలస: నూతన సంవత్సరం సందర్భంగా సంగివలస కొత్తమ్మతల్లి ఆలయం, బైపాస్ రోడ్డులోని విజయదుర్గ ఆలయం, వెంకటేశ్వరమెట్టపై శ్రీవారి ఆలయం, సత్యనారాయణ కొండపై రమా సత్యనారాయణస్వామి ఆలయాలు రద్దీగా మారాయి. సంగివలస ముగ్గురు అమ్మవార్ల ఆలయంలో రెడ్డిక కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ శీరపు అప్పలరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. రెడ్డిక సంఘం ప్రతినిధులు నీలాపు సురేష్‌రెడ్డి, నీలాపు సన్యాసమ్మ, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

అంతటా ఆనందోత్సాహాలు

- ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



పద్మనాభం మండల పరిషత్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ రాంబాబు, ఎంపీడీవో విజయ్ కుమార్



కేక్ కట్ చేస్తున్న చర్చి సంఘ సభ్యులు



ఏపీఎస్పీ పోలీస్ బెటాలియన్‌లో వేడుకలకు హాజరైన అధికారులు, సిబ్బంది

తగరపువలస/పద్మనాభం: నూతన సంవత్సర వేడుకలు భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో బుధవారం ఘనంగా జరిగాయి. భీమిలి ఎంపీపీ దంతులూరి వెంకట శివ సూర్యనారాయణరాజు, మండల పార్టీ అధ్యక్షుడు గాడు శ్రీను, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడును ఎంపీటీసీ, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలియచేశారు. జీవీఎంసీ 2వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జరిగిన నూతన సంవత్సర వేడుకలలో జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, మాజీ కౌన్సిలర్ చేట్ల ఎల్లయ్యరెడ్డి, చిల్ల బాబయ్యరెడ్డి, చింతగుంట శివ, చిల్ల గణేష్‌రెడ్డి, వెంపాడ రమణ తదితరులు పాల్గొని కేక్ కట్ చేశారు.

● పద్మనాభం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ కేక్ కట్ చేశారు. ఎంపీపీతో పాటు జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబుకు పలువురు అధికారులు, అభిమానులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియ జేశారు. కార్యక్రమంలో ఏవో జయ ఉమ, వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, నాయకులు తాలాడ పద్మనాభం, తోనంగి అప్పలనాయుడు, శిరుగుడి ఆదినారాయణ, ఈర్ల ఈశ్వరరావు పాల్గొన్నారు.

సెయింట్ పీటర్స్ చర్చిలో..

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని కీతినోపేట వద్దనున్న చారిత్రక సెయింట్ పీటర్స్ చర్చి వద్ద చర్చి సంఘ గౌరవ కార్యదర్శి డాక్టర్ కులిడి సురేష్‌బాబు ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా పాస్టర్ రెవరెండ్ చైతన్యకుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ప్రత్యేక ప్రార్థనలు చేసి, దైవ సందేశాన్ని ఇచ్చారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చర్చి సంఘ సభ్యులు సురేష్, చార్లెస్, డాక్టర్ భావన, సాహితి, హైమావతి, సుధాకర్, లీల, థామస్ పాల్గొన్నారు.

నేతలకు శుభాకాంక్షలు

మధురవాడ: ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణను వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతిన హనుమంతురావు, మహిళా నాయకురాలు చేకూరి రజని, పోతిన శేషుబాబు, బోయి సూర్రెడ్డి తదితరులు కలిసి, శుభాకాంక్షలు తెలిపారు.



మాట్లాడుతున్న 16వ బెటాలియన్ కమాండెంట్ మురళీకృష్ణ

● వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్‌ను పార్టీ విశాఖ జిల్లా నాయకుడు పిళ్లా సూరిబాబు, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యుడు పీకేఎం పాత్రుడు, పీవీజీ అప్పారావు, అప్పన్న తదితరులు కలిసి, శుభాకాంక్షలు తెలియజేశారు.

ఏపీఎస్పీ పోలీస్ బెటాలియన్‌లో..

పీఎం పాలెం: జీవీఎంసీ ఆరోవార్డు పరిధి బక్కన్నపాలెం సమీపంలోని ఏపీఎస్పీ పోలీస్ బెటాలియన్‌లో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా 16వ బెటాలియన్ కమాండెంట్ కేవీ మురళీకృష్ణ మాట్లాడుతూ బెటాలియన్‌కు రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు వచ్చేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ సీహెచ్ వీఎస్ పద్మనాభరాజు, అసిస్టెంట్ కమాండెంట్లు పి.సత్యనారాయణ, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

● శిల్పారామంలో జాతర వాకర్స్ అసోసియేషన్, పాటల పందిరి సభ్యుల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

మంచు కురిసే వేళలో..



వేకువజామున పొగమంచుతో భీమిలి పరిసర ప్రాంతాలు ఆహ్లాదకరంగా మారాయి. ప్రకృతి ప్రేమికులు ఆ వాతావరణాన్ని ఆస్వాదించారు. మరోవైపు ప్రధాన రహదారులతో పాటు జాతీయ రహదారిపై మంచు కమ్ముకోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. – తగరపువలస